**పట్టపగలు** పది మంది చేరే లైబ్రరీ హాల్లో ఒక సుబ్బారాయుడి చెంప చెళ్ళు మనిపించి, "ఏం కూశావురా, రాస్కెల్! నే నేం మీ అత్త కూతురి ననుకున్నావా, సరసా లాడటానికి? బీ కేర్ ఫుల్ యు డాగ్!" అంటూ కోపంతో వూగిపోతున్న పరిమళ ఉగ్రరూపాన్ని చూడటం నా కదే మొదటిసారి.

సిగ్గుతో తల ఎత్తలేక ఆ కామెంట్ వేసిన శాస్త్రి ఎటో అదృశ్యమయ్యాడు. పరిమళ గర్వంగా తల ఎగరేసి పక్కనున్న మరో అమ్మాయితో అక్కడి నుండి వెళ్ళిపోయింది.

"బ్రేవో, పరిమళా! బోలో భారత్‌నారికి జై! పొగరుమోతు పరిమళాదేవికీ జై!" అని పరిహాసిస్తూ, పరిమళను రెచ్చగొడుతూ ఒక అల్లరి మూక ఆమె వెంటపడింది.


అంతకు ముందు పరిమళ గురించి చాలామంది నోట నేను చాలా విన్నాను. ఆమెకు ఒంటి నిండా గర్వమని, మాట దురుసుతనం ఎక్కువని, పొగరుమోతని...ఇలా చాలా రకాలుగా చెప్పుకుంటారు. కాలేజీ ఆవరణలో కుర్రవాళ్ళు గ్రూపులుగా ఒక చోట చేరినప్పుడు ఆమె గురించి తేలికగా, హేళనగా మాట్లాడుకుని ఆనందిస్తారు. మా భానుమూర్తి విలేఖరిలా ఆ వార్తలన్నీ సేకరించి నా చెవిన వేస్తుంటాడు. అవన్నీ గాలి వార్తల కింద కొట్టి పడేసే వాడిని తప్ప, అంతగా పట్టించుకునేవాడిని కాదు. మనకు సంబంధం లేని విషయాల్లో తల దూర్చడం అంత మంచి అలవాటు కాదని అప్పుడప్పుడు భానుమూర్తిని మందలించేవాడిని.

పరిమళ అయిదారేళ్ళుగా మా ఎదురింట్లోనే ఉంటున్నా, ఆమె గురించి నాకు తెలిసిన విషయాలు చాలా తక్కువ. ఆమె చామనచాయలో ఉన్నా అందంగానే ఉంటుందనీ, నేను చదివే కాలేజీలోనే ఆమె ఇంటర్ ఫైనలియర్ చదువుతూందనీ, సాయంత్రాలు తరుచుగా డాబామీద కూర్చుని పుస్తకాలతో కాలక్షేపం చేస్తుందనీ, వాళ్ళ నాన్న గారు పెద్ద ఎత్తున ఏదో బిజినెస్ చేస్తున్నారనీ, ఆయన ఈ మధ్యనే కోవాళంగు ఫియట్ కారొకటి కొన్నారనీ, వాళ్ళ ఇంటి గుమ్మంలో ఒక అల్సేషియన్ కుక్క తోకాడించుకుంటూ తిరుగుతుందనీ మాత్రమే నాకు తెలుసు. పరిమళను గురించి అంతకు మించిన విషయాలు నాకు తెలీవు. తెలుసుకోవలసిన అవసరం కానీ, సందర్భంకానీ ఎప్పుడూ ఏర్పడలేదు.

"ఇన్నాళ్ళూ నేను ఎన్ని చెప్పినా నువ్వు నమ్మలేదు. అవన్నీ కట్టుకథలని కొట్టిపారేసేవాడివి. ఇవాళ పరిమళ విశ్వరూపం నీ కళ్ళతో చూశావుగా! ఇప్పుడు ఏమంటావ్, మై డియర్ చంద్రం!" ఆ మాట అన్నది భానుమూర్తి.

ఇందాకటి నుండి నేను పరిమళ గురించే ఆలోచిస్తున్నాను. అందుచేత వాడు ఏం అడిగిందీ నేను సరిగ్గా వినిపించుకో లేదు.

"పరిమళను గురించి నీ కింకా పూర్తిగా తెలీదు. ఆమెకు ఎంత గర్వమనుకున్నావు? ఆడదానికి ఉండవలసిన అణకువ, సహనం—ఇలాంటి కనీస లక్షణాలు కూడా లేవు. కాలేజీలో ఏ కొంటె వెధవో సరదాగా కామెంట్ వేశాడే అనుకో! వినీ విననట్టు వూరుకుంటే పోతుందిగా! నేను మాత్రం తీసిపోయానా అని మగరాయుడిలా పోజు పెట్టి వాళ్ళతో కయ్యానికి కాలు దువ్వుతుంది. నువ్వు ఎన్నయినా అను కానీ, ఆడవాళ్ళకు అంత పొగరు పనికిరాదురా, చంద్రం!"




# చెలగాటం

యస్వీ రావ్

తిరిగి భానుమూర్తే అన్నాడు. నేను మవునంగా ఉండటం చూసి.

"ఈ రోజుల్లో ఆడపిల్లలు ఆ మాత్రం డేషింగ్‌గా ఉండాల్సిందే! లేకుంటే మన వాళ్ళు సామాన్యులా! ప్రేమగీతాలు, ప్రణయ వచనాలతో ఎక్కడ పడితే అక్కడ వీళ్ళను అల్లరిపాలు చెయ్యరూ? నన్నడిగితే పరిమళ లాంటి వాళ్ళు ప్రతి కాలేజీలో క్లాసుకి ఒక్కరయినా ఉండాలి. అప్పుడు అమ్మాయిలుకూడా మన లాగే కాలేజీల్లో దర్జాగా, దీమాగా ఉండగలరు" అన్నాను, ఆ ప్రసంగం అంతటితో ఆపు చేద్దామని.

"నువ్వలా పూరికే ఆమెను వెనకేసుకు రావడం నా కేం నచ్చలేదు. మొన్నటికి మొన్న ఏం జరిగిందో తెలుసా? నేను, మన శేఖర్‌గాడు మెట్ల దగ్గర నిలుచుని ఏదో పిచ్చాపాటి మాట్లాడుకుంటున్నాం. మాటల మధ్య నే నేమో జోక్ కట్ చేసేసరికి వాడు ఫకాలున నవ్వాడు. ఆ సమయానికి ఈ పొగరుమోతు ఆటే వెళుతూంది. శేఖర్ తనను చూసే నవ్వేడనుకుని ఏమేమో వాగుకుంటూ వెళ్ళిపోయింది. చేతకాని వెధవ కాబట్టి వాడు నోరు మూసుకుని పూరుకున్నాడు. అదే నే నయితేనా?" అని ఆగిపోయాడు, నా ముఖంలోకి ప్రశ్నార్థకంగా చూసి.

వాడు చెప్పిన వన్నీ విన్నాకకూడా నేను పరిమళనే సమర్థించాను. ఆ తప్పు ఆమెది కాదని, ఆమెను అల్లరి పెట్టి, ఆమె కోపాన్ని రెచ్చగొడుతున్న వాళ్ళదే నని వాడితో నేను చాలా సేపు వాదించాను. నేను పరిమళను సమర్థించడం వాడికి బొత్తిగా ఇష్టం లేనట్టుంది.

అంతసేపూ సరదాగా మాట్లాడుతున్న వాడల్లా సీరియస్‌గా మారిపోయి, "చంద్రం! ఆ అమ్మాయిని నువ్వొక్కడివి సమర్థించినంత మాత్రాన సరిపోదు. నీకు అంత చేతనయితే ఆమెను సరైన దారికి మళ్ళించు. ఆమె ప్రవర్తనలో మార్పు తీసుకు రావడానికి ప్రయత్నించు. పది మందీ కలిసి పరిమళ మంచితనాన్ని గుర్తించేలా చెయ్యి. అది గొప్పతనం అనిపించుకుంటుందేమో కానీ, పూరికే వెనకేసుకు రావడం వలన ఏ ప్రయోజనమూ ఉండదు" అన్నాడు భానుమూర్తి ఎంతో ఆవేశంగా.

"నే నేమిటి! పరిమళలో మార్పు తీసుకు రావడం ఏమిటి? అదెలా సాధ్యపడుతుందిరా?" అన్నాను. వాడు ఏ ఉద్దేశంతో అలా అన్నాడో తెలుసుకోవాలని.

"తప్పకుండా సాధ్యపడుతుంది. పరిమళ ప్రేమను పొందగలిగితే అదేమంత కష్టమైన పని కాదు. నువ్వు తలుచుకుంటే ఆ పని చాలా సులువుగా సాధించగలవు. పరిమళ మీ ఎదురింట్లో రోజూ నీ కళ్ళముందే తిరుగుతూ ఉంటుంది కాబట్టి నీ కా అవకాశం ఉంది. బాగా ఆలోచించి చూడు."

భానుమూర్తి అభిప్రాయం విన్నాక ఒకింత ఆలోచనలో పడిపోయాను. పరిమళను ప్రేమించడానికి గాని, ఆమెను అర్ధాంగిగా పూహించుకోవడానికి గానీ నా మనసుకి ఇష్టం కాని పని.

నా మనసులో భావాన్ని గ్రహించి, "నీ సందేహమేమిటో నాకు తెలుసు, చంద్రం! పరిమళను నువ్వు నిజంగా ప్రేమించాల్సిన అవసరం లేదు. కొన్నాళ్ళపాటు ప్రేమించినట్టు నటిస్తే చాలు. అప్పుడప్పుడు నువ్వు సరదాగా నాటకాల్లో వేసే ఒక పాత్ర అనుకో! ఇంతవరకు నువ్వు ముఖానికి రంగు పూసుకుని స్టేజిమీద నటించావు. ఇప్పుడు మనస్సుకి నచ్చ చెప్పి జీవితంలో నటించాలి. అంతే తేడా! నీకు మనసు ఇవ్వడానికి సిద్ధపడిన ఆడది నీ మాటకి తప్పకుండా విలువ నిస్తుంది. నీ పాత్రని నువ్వు జాగ్రత్తగా పోషించి, పరిమళను ఒక మంచి మార్గంలో పెట్టడానికి ప్రయత్నించు. ఆ పైన ఏమన్నా జరిగితే నేను చూసుకుంటాను" అని ధైర్యం చెప్పాడు భానుమూర్తి.


నా మస్తిష్కంలో అమాయకంగా కనిపించే పరిమళ రూపం ఒకసారి నిలిచింది. ఆమెను సతాయిస్తూ, ఆమె కోపాన్ని రెచ్చగొడుతూ ఒక అల్లరి మూక ఆమె వెంటపడింది. వాళ్ళు చేసే అల్లరి భరించలేక, సంస్కారంలేని వాళ్ళ మాటలు సహించలేక పరిమళ ఎదురు తిరిగింది. ఆ అల్లరి మూకతో యుద్ధం చెయ్యలేక ఓడిపోయి, ఒంటరిగా ఒక మూల కూర్చుని వెక్కి వెక్కి ఏడుస్తూంది.

అటువంటి దయనీయమైన స్థితిలో పరిమళను నేను చూడలేను. ఆమె ప్రవర్తనలో మార్పు తీసుకు రావడం కోసం నాకు ఇష్టం కాకపోయినా మా భానుమూర్తి సలహా పాటించడం తప్పనిసరి అయింది.

• • • •

పడమటి కొండల్లోకి జారుకుంటున్న సూర్యుడు ఎర్రగా—నిండుగా కనిపిస్తున్నాడు.

ఎదురింటి డాబా మీద అందమైన భంగిమలో కూర్చుని పరిమళ పుస్తకం చదువుకుంటూంది. చెదిరిన ఆమె ముంగురులు చిరుగాలికి నుదుట సుతారంగా రేగుతున్నాయి. చక్రాల్లాంటి ఆమె కళ్ళు పుస్తకం లోని అక్షరాల్ని చురుకుగా పరిశీలిస్తున్నాయి. నేను రెప్ప వాల్చకుండా ఆమెవైపే చూస్తూ ఉన్నాను. ఆమె చాలా తెలివిగా అప్పుడప్పుడూ నన్ను ఒక కంట గమనిస్తూ ఉంది.




నేను ఆమె కళ్ళలోకి సూటిగా చూసినప్పుడల్లా పుస్తకంలోకి దృష్టి మరలిస్తూంది. అలా లాభం లేదని తెలుసుకుని, ధైర్యం చేసి కళ్ళతో పలకరించాను. ఆమె ముఖంలో వెంటనే రంగులు మారాయి. ఆమె కళ్ళలో ఒక విధమైన నిర్లక్ష్యం తొంగి చూసింది. ఒకసారి నా వైపు కోపంగా చూసి, మరో పక్కకి తిరిగి కూర్చుంది. మొదటి రోజు పరిమళతో పరిచయం ఆ విధంగా జరిగింది.

ఆ తర్వాత ప్రతి రోజూ సాయంత్రాలు విధిగా ఆమె దర్శనం చేసుకునే వాడిని. నేను ట్రిమ్ముగా తయారై అయిదు గంటంకే మా డాబా మీద హాజరయ్యే వాడిని. పరిమళ రాకకోసం ప్రతి క్షణం ఎంతో ఆత్రతగా ఎదురుచూసే వాడిని. అయిదున్నర ప్రాంతంలో చేతిలో పుస్తకాంతో ప్రత్యక్షమయ్యేది పరిమళ. నేను ఆమె వైపు కొంటెగా చూడడం, కళ్ళతో చిలిపిగా సైగలు చెయ్యడం, బదులుగా ఆమె కళ్ళలో చిరుకోపం ప్రదర్శించడం, నిర్లక్ష్యంగా నవ్వడం, పెంకెగా మూతి తిప్పడం చేసేది. ఆ సౌంజ్ఞలకి సంకేతాలేమిటో ఎంత బాగా ఆలోచించినా నా కర్థం కాలేదు.

ఒక రోజు కాలేజీలో భానుమూర్తితో ఆ విషయమే చర్చించాను. వాడు ఒక క్షణం ఆలోచించి పరిమళకి ప్రేమలేఖ ఒకటి రాయమని సలహా ఇచ్చాడు. ఆ ఉత్తరం ఆమెకు ఎప్పుడు, ఎలా అందజేయాలో కూడ వాడే చెప్పాడు.

ఆ మరునాటి సాయంత్రానికి నా చేతిలో సిద్ధంగా ఉంది ఉత్తరం. ఎప్పటిలా డాబామీద కూర్చుని చదువుకుంటోంది పరిమళ. ఆమె చేతిలో పుస్తకం ఉన్న మాట నిజమే కానీ, చూపులుమాత్రం నా చుట్టూ తిరుగుతున్నాయి.

చేతిలో ఉన్న ఉత్తరాన్ని నాలో నేను మరోసారి చదువుకున్నాను.

"ఎదురింటి అమ్మాయిగారికి,

వెన్నెల చల్లగా ఉంటుందని చెప్పడం ఎంత

నిజమో, నేను మిమ్మల్ని ప్రేమిస్తున్నానని చెప్పడం కూడా అంతే నిజం. మిమ్మల్ని నే నెంతలా ఆరాధిస్తున్నానో చెప్పడానికి ఈ కాగితం ముక్క చాలదు. మీతో మనసు విప్పి చెప్పుకోవలసిన విషయాలు చాలా ఉన్నాయి. నన్ను నిరాశ పరచకుండా ఆదివారం సాయంత్రం అయిదు గంటలకి బీచి దగ్గర కనిపించండి. నా ప్రయత్నం వృథా పోదనే నమ్మకంతో మీకోసం ఒళ్ళంతా కళ్ళు చేసుకుని ఎదురుచూసే —

—చంద్రం."

ఆ ఉత్తరాన్ని ఒక కవరులో పెట్టి చిన్న కాగితపు బంతిలా మడిచి పట్టుకున్నాను. చుట్టుపక్కల ఎవ్వరూ గమనించడం లేదని నిర్ధారణ చేసుకున్నాక ఉత్తరం సరిగ్గా పరిమళ ఒడిలో పడేలా గురి చూసి విసిరాను. వూహించని ఆ చర్యకు ఆమె కొంత కంగారు పడింది. ఒడిలో ఉన్న ఉత్తరాన్ని వెంటనే చేతిలోకి తీసుకుని నా వైపు కోపంగా చూసింది. దిగ్గున పైకిలేచి నేను చూస్తుండగా డాబా దిగి వెళ్ళిపోయింది. నా కేమీ పాలు పోలేదు. భయంతో గుండె వేగంగా కొట్టుకోవడం మొదలుపెట్టింది. శరీరంలో ఒక విధమైన వణుకు పుట్టుకొచ్చింది.

పరిమళ వాళ్ళ ఇంట్లో చెబితే! ఆమె ఇంట్లో వాళ్ళు మా ఇంటి మీద దాడి జరిపితే! అనవసరంగా తొందరపడ్డానేమో అనిపించింది.

మరునాడు కాలేజీలో భానుమూర్తి కనిపించడంలో ఆ విషయం చెప్పాను. అంతా విని వాడు తేలికగా నవ్వేస్తూ, "నువ్వేం దిగులు పడకురా, చంద్రం! పరిమళ తప్పకుండా బీచి కొస్తుంది. చూస్తుండు" అన్నాడు ఏదో జోస్యం తెలిసినట్టు.

పరిమళ బీచికి రావడం మాట ఎలా ఉన్నా, వాళ్ళ ఇంట్లో కంప్లైంట్ చెయ్యకుండా ఉంటే చాలని పించింది.

• • •

ఎదురుచూసిన ఆదివారం రానే వచ్చింది. నేను రాదేమోనని అనుకున్న పరిమళ నన్ను నిరాశపరచకుండా వచ్చింది.

బీచిలో ఒక మూల జనసమ్మర్దం లేని చోట ఇద్దరం కూర్చున్నాము. పరిమళ అందంలో నా కా రోజు ఏదో ప్రత్యేకత కనిపించింది. ఆమె అలంకరణ సాధారణంగా కన్నా ఎంతో ఆకర్షనీయంగా ఉంది. లేత గులాబీ రంగు చీరలో దాగిన ఆమె సొగసుని, సౌందర్యాన్ని కళ్ళప్పగించి చూస్తున్నాను. పరిమళ మోకాళ్ళ మీద తల ఆన్చి, ఇసుకలో ఏవో పిచ్చిగీతలు గీస్తూ చెరుపుతూ ఉంది.

మా మధ్య క్షణాలు మౌనంగా దొర్లిపోతున్నాయి.

బీచిలో కలుసుకోమని పరిమళకు ఉత్తరం అయితే రాశాను కానీ, ఏం మాట్లాడాలో, ఎలా మొదలెట్టాలో నాకు అర్థం కావడం లేదు. అంతకు ముందు ఏ అమ్మాయితో నయినా ఏకాంతంగా మాట్లాడి ఉంటే, ఆ రోజు ఇంత ఇబ్బంది లేకపోను.

ఎంతసేపూ అలా మౌనంగా కూర్చోవడం బాగుండదని, "నా మీద అభిమానంతో ఇంత దూరం వచ్చినందుకు థాంక్స్, పరిమళా!" అన్నాను, ఏదో ఒకటి మాట్లాడాలని.

"నాతో ఎన్నో విషయాలు మాట్లాడాలని ఉత్తరంలో రాసినట్టున్నారు" అంది పరిమళ, నా వోపెనింగ్ స్పీచ్ బాగులేదన్నట్టు ముఖం పెట్టి.

ఆమెతో ఎన్నో విషయాలు మాట్లాడాలని అనుకున్న మాట నిజమే! కానీ, ఎంతో అందంగా పేర్చుకున్న ఆ మాటలన్నీ మనసులో ఎక్కడో చిక్కుపడిపోయాయి. ఒక్క మాట అయినా ఇప్పుడు పెదవి దాటి బయటకు రావడం లేదు. గుండె మాత్రం ఎన్నడూ లేనంత వేగంగా కొట్టుకుంటూంది.

"పరిమళా! ఈ రోజు మీరు చాలా అందంగా కనిపిస్తున్నారు" అనగలిగాను ధైర్యం చేసి.

ఆమె సన్నని పెదవులపై చిరునవ్వు తొణికిసలాడింది. ఎప్పుడూ కోపంగా కనిపించే పరిమళ అంత చక్కగా నవ్వగలదని, ఆ నవ్వులో వెన్నెల అంతటి చల్లదనం దాగి ఉందని నా కప్పుడే తెలిసింది.

"మీ రింత చక్కగా నవ్వడం చూస్తుంటే రోజూ మా ఎదురింటి డాబా మీద కోపంగా చూసే అమ్మాయేనా ఈ పరిమళ అని అనుమానం కలుగుతూంది" అన్నాను ఆమె కళ్ళలోకి గుచ్చి చూస్తూ.

"నన్ను బీచికి రమ్మని ఇవేనా మీరు చెప్ప దలచుకున్న విషయాలు" అంది పరిమళ, చిలిపిగా కళ్ళు కదిలిస్తూ.

ఏమయితే అయిందని నాలో ఉన్న ధైర్యాన్నంతటనీ కూడగట్టుకుని, "ఐ లవ్ యు, పరిమళా!" అనేశాను.

దూరాన సముద్రంలో లేచిన కెరటం ఒకటి ఫెళ్ళుమని ఒడ్డుకు వచ్చి పడింది. నా చెంప ఎక్కడ చెళ్ళుమంటుందోనని ఒక్క క్షణం భయం కలిగింది. కానీ, పరిమళ అటువంటి తొందరపాటు పనేదీ చెయ్యలేదు. నా ముఖంలోకి సూటిగా చూడలేక; సిగ్గుపడుతూ మరో వైపు తల తిప్పేసుకుంది.

ఆమె మౌనాన్ని ఎంతోసేపు భరించలేక "పరిమళా ప్లీజ్ మీ అభిప్రాయం చెప్పండి. సంతోషిస్తాను" అని ఆత్రతగా అడిగాను.

పరిమళ నోటితో బదులు చెప్పలేదు. కానీ, కళ్ళతో తన అభిప్రాయాన్ని వ్యక్తపరిచింది. ఆమె సమాధానం నన్ను కాసేపు ఆనందంలోను, మరి కాసేపు ఆశ్చర్యంలోను ముంచివేసింది.

నా ప్రేమను అంగీకరించిన పరిమళ నన్ను చూసినప్పుడల్లా నిర్లక్ష్యంగా నవ్వడం, కళ్ళలో చిరుకోపం ప్రదర్శించడం, కొంటెగా మూతితిప్పడం— ఇవన్నీ ఎందుకు చేసినట్టు? నా మనసులో ఉన్న ఆ సందేహాన్ని పరిమళ ముందు పెట్టాను.


ఆమె పగలబడి నవ్వుతూ, "అవన్నీ మీకు నేను పెట్టిన పరీక్షలు. అన్నిట్లోనూ మీరు నెగ్గారు" అని జవాబు ఇచ్చింది.

ఏది ఏమయినా నా ప్రయత్నం వృథా పోలేదు. ఆశించిన విధంగా పరిమళ ప్రేమను పొందగలిగాను. కానీ, నా బాధ్యత అంతటితో తీరిపోలేదు. నేను ధరించవలసిన అతి క్లిష్టమైన పాత్ర ఇకమీదట ఉంది. పరిమళతో ప్రతిక్షణం నేను ఎంతో తెలివిగా, జాగ్రత్తగా ప్రవర్తించాలి. ఎప్పుడూ ఆమె హితవు కోరే ఒక మంచి స్నేహితుడిలా మెలగాలి. ఆమెను సరైన మార్గంలో నడిపించి పనికిమాలిన వెధవల నోళ్ళు మూయించాలి. ఆ పని ఎంత త్వరగా సాధించగలిగితే అంత త్వరగా నా పాత్రకి గుడ్ బై చెప్పి, తేలికగా గాలి పీల్చుకోవచ్చు.

• • •

రోజులు గడిచేకొద్దీ పరిమళతో నా పరిచయం బలపడుతూ ఉంది. కాలేజీలో ఒకరి నొకరం చూసుకుని కళ్ళతో పలకరించుకొనే వాళ్ళం. ఎప్పుడయినా తీరిక దొరికితే బీచికి వెళ్ళి చీకటి పడేవరకు కబుర్లు చెప్పుకునే వాళ్ళం. సాహిత్యం, సినిమాలు, రాజకీయాలు... ఒకటన్న మాటేమిటి—అన్ని విషయాలు మా సంభాషణల్లో దొర్లేవి.

నా మాటల్లో ఎక్కువగా ఆడవాళ్ళ ప్రస్తావన తీసుకొచ్చే వాడిని. ఆడవాళ్ళు ఎప్పుడు, ఏ విధంగా నడుచుకోవాలో, ఏ సందర్భంలో ఎలా మాట్లాడాలో నాకు తోచిన విషయాలేవో చెప్పేవాడిని. ముఖ్యంగా మగవాళ్ళతో చాలా జాగ్రత్తగా ప్రవర్తించాలని,



వాళ్ళతో పేచీకి దిగడం వలన కలిగే అనర్థాలు ఎలా ఉంటాయో కథలు అల్లి చెప్పేవాడిని. నేను అమ్మాయిలను విమర్శించినప్పుడల్లా పరిమళ ముఖం ఇబ్బందిగా పెట్టేది. ఒక్కోసారి నాతో వాదానికి కూడా దిగేది. ఆడవాళ్ళను ఆటబొమ్మలుగా, బానిసలుగా చూసే మగాళ్ళను ఉరి తీసినా ఫర్వాలేదు అన్న ధోరణిలో మాట్లాడేది.

ఒకవైపు ఆమె అభిప్రాయాలను సమర్థిస్తూనే, మరోవైపు నేను చెప్పాలనుకున్న విషయాలను నేర్పుగా ఆమె బుర్రలోకి ఎక్కించేవాడిని. నేను ఎప్పుడు ఏం చెప్పినా పరిమళ సహృదయంతో అర్థం చేసుకునేది. ఎదురు తిరిగి చెప్పాలని ఆమె ఏ నాడూ ప్రయత్నించలేదు. అందరూ అనుకునే పెంకెతనం, దురుసుతనం పొరపాటున కూడా నా ముందు ప్రదర్శించేది కాదు. నేనంటే ఒక విధమైన భయం, ప్రత్యేకమైన గౌరవం ఆమెకు ఉన్నాయి. ఆమెలో ఎప్పటికయినా మార్పు తీసుకు రాగలననే నమ్మకం నా కుంది.

పరిమళ ఎవరు? నే నెవర్ని? ఆమెకూ, నాకూ ఉన్న సంబంధం ఏమిటి? ఆమెలో మార్పు తీసుకు రావాలని నే నెందుకు సంకల్పించాలి? అందువలన నాకు ఒరిగే దేమిటి? ... సమాధానాలుమాత్రం దొరకలేదు.

• •

"పరిమళా!" లాలనగా పిలిచాను.

"వూఁ!" అంది ఆమె ఎటో చూస్తూ.

"నువ్వు కోపం తెచ్చుకోనంటే ఒక విషయం చెబుతాను."

"అలాగే! చెప్పండి."

"నీ ప్రవర్తన కొద్దిగా మార్చుకోవాలి."

పరిమళ నా ముఖంలోకి ప్రశ్నార్థకంగా చూసింది.

"ఏమిటి నా ప్రవర్తనలో మీకు కనుపించిన లోపం?"

ఆమె ముఖంలో ప్రసన్నత లోపించింది.

"నువ్వలా కోపం తెచ్చుకుంటే నే నేమీ చెప్పలేను."

"నా కది అలవాటే! ఫర్వాలేదు, చెప్పండి."

"కాలేజీలో అంతా నీ గురించి ఎంత చెడ్డగా చెప్పుకుంటారో తెలుసా! నీకు ఒంటినిండా గర్వమని, పొగరుమోతువని, దురుసుగా మాట్లాడతావని రకరకాలుగా చెప్పుకుంటారు. నీకు బాధగా లేదా? పరిమళా! నీ మంచి కోరేవాడిని కాబట్టే, నిజాన్ని ఇంత ధైర్యంగా నీతో చెప్పగలుగుతున్నాను."

"ఏమిటి నిజం? ఆడది కనిపించగానే నోటి కొచ్చినట్టు వాగడానికి మీ మగవాళ్ళకి మాత్రం ఏం హక్కు ఉంది? వాళ్ళు అనే పాడు మాటలన్నీ విని నోరు మూసుకోవాలా? అది నా తరం కాదు. నన్ను ఎవరయినా పల్లెత్తు మాట అంటే సహించను. నా నోటి కొచ్చింది నేనూ అంటాను. నాకేం భయమా?" అంది పరిమళ అలవాటు ప్రకారం తల ఎగరేస్తూ.

"పరిమళా! అంత మొండిగా మాట్లాడకు. నీ కెలా చెబితే బోధపడుతుందో నా కర్థం కావటం లేదు. కొందరి మగవాళ్ళ స్వభావం అలాగే ఉంటుంది. వినీ విననట్టు వూరుకుని, మన దారిన మనం పోతే ఏ గొడవా ఉండదు. ఒక రోజు, రెండు రోజులు వెంటపడి అల్లరి చేస్తారు. నీ నుండి ఎటువంటి రెస్పాన్సు రాకపోయేసరికి మూడో నాటికే నీ వెనక ఒక్కడూ ఉండడు. దటీస్ హ్యూమన్ నేచర్! మన కున్న తెలివిని ఉపయోగించి తప్పించుకోవాలిగానీ, అలా ఎక్కడ పడితే అక్కడ మగవాళ్ళతో పేచీకి దిగితే ఎంత అసహ్యంగా ఉంటుందో వూహించావా? నీ బలహీనతల్ని కనిపెట్టే అందరూ నిన్నలా రెచ్చగొడుతున్నారు. ఆవేశంలో నువ్వు ఏదో అనడం, ఆ విషయం నలుగురూ చెప్పుకోవడం, తిరిగి పరిమళ ఇలాంటిదని నీ కో చెడ్డ పేరు ఆపాదించడం—ఇవన్నీ ఆలోచించావా? రేపు పొద్దుట అవన్నీ నీ భవిష్యత్తుకి మచ్చగా మిలిస్తే నువ్వు భరించగలవా? చెప్పు, పరిమళా!" ఎన్నడూ లేనంత కోపంగా, ఆవేశంగా మాట్లాడాను.

పరిమళ కనుకొలకుల్లో నీళ్ళు చిప్పిల్లాయి. ఆమె కన్నీళ్ళు చూసి నేను కొంత కంగారు పడ్డాను.

"నా ప్రవర్తనలో ఇంత లోప ముందని నే నెప్పుడూ అనుకోలేదు, చంద్రం! చిన్నప్పటి నుండి ఇంట్లో అందరూ నన్ను ముద్దుగా, గారాబంగా చూసినందున, పల్లెత్తు మాట అనకుండా పెంచి నందున నాకు వేరొకరి మాట సహించే పాటి ఓర్పు లేకుండా పోయింది. మీరు ఏం చెప్పినా, నా మంచి కోసం, నా మేలు కోరి చెబుతారనే నమ్మకం నా కుంది. మీ మాట ప్రకారం ఈ రోజు నుండి నా అలవాట్లు మార్చుకుంటాను. నా ప్రవర్తనలో ఉన్న లోపాలను సరిదిద్దుకుంటాను. ఇంకా నేను ఏ విధంగా మారాలో, ఎలా నడుచుకోవాలో చెప్పండి. మీ మాట అక్షరాలా పాటిస్తాను. నన్ను శాసించే

ప్రఖ్యాతి చెందిన!
ఖటావ్ మిల్లు వారి
★ 100% పాలియస్టర్ చీరలు
★ ఫుల్‌వాయిల్, అఫ్ వాయిల్ చీరలు
★ షర్టింగులు, గ్లాసుతో ధోవతులు
★ త్రస్ పెటీకోటులు, ... రూబియాలు
★ స్కూలు యూనిఫారంలు _ వగైరాలకు
విజయ షోరూమ్
ప్రత్యేక ఖటావ్ మిలు వస్త్రముల షోరూమ్
గవర్నరుపేట ... విజయవాడ

# ఆహార వైద్యము

మన రోగాలను నయం చేసుకోవటానికి కావలసిన మందులన్నీ మనం తినే పండ్లు, దుంపలు, కూరగాయల్లో సహజంగా ఉన్నాయి. ఈవైద్యం సుఖంగా ఉంటుంది. కీడు చేయదు. ఖర్చు తక్కువ. "ఆహారవైద్యము" అనే యీ తెలుగు పుస్తకంలో ప్రఖ్యాత ప్రకృతి వైద్యులు కృషిచేసి ఏరోగానికేమి తినాలో కనుగొని తెల్పిన వివరాలన్నీ ఉన్నాయి. ఇది చదివి రుచిగల పదార్థాలు తింటూ మీకొచ్చే జబ్బులను స్వయంగా [illegible]కంగా నయం చేసుకోవచ్చును. వెల రూ. 12. పోష్టు ఖర్చులదనం. దేశసేవ ప్రచురణలు, 5/3 ఆర్‌.టి., పంజాగుట్టకాలని, హైదరాబాదు-4 కు ఉత్తరం వ్రాసి మీ ఉపయోగానికి ఓ పుస్తకాన్ని వి.పి. పోష్టుద్వారా పొందండి.

హక్కు, అధికారం మీకు కాక ఎవరి కుంటాయి?" అంది పరిమళ, వచ్చే దుఃఖాన్ని ఆపుకుంటూ.

పరిమళ నా మాటకు అంత విలువ ఇస్తుందనీ, ఆమెలో ఇంత వేగంగా మార్పు వస్తుందనీ నేను వూహించనయినా లేదు. నా ప్రయత్నం అంత సులువుగా, తొందరగా నెరవేరుతుందని నేను కలలో కూడా అనుకోలేదు.

పరిమళ ప్రవర్తనలో ఆ మరుసటి రోజు నుండే మార్పు కనిపించింది. అప్పటివరకు ఆమె వెంటబడి అల్లరిచేసిన వాళ్ళంతా ఒక్కరొక్కరే వెనక్కి తగ్గారు. ఆమెను ఎప్పటికప్పుడు రెచ్చగొట్టి వినోదం చూసే వాళ్ళందరి నోళ్ళు మూతబడ్డాయి. ఎవరేమన్నా తనకు పట్టనట్టు, తనను కానట్టు ఆమె తల దించుకుని వెళ్ళిపోయేది. కొన్నాళ్ళకి ఆమె విషయమే ఎవరూ పట్టించుకోవడం మానేశారు.

పరిమళలో అకస్మాత్తుగా వచ్చిన ఈ మార్పుకి ఇంటా, బయటా అందరూ ఆశ్చర్యపోయారు. పరిమళ శ్రేయస్సు కోరే వాళ్ళంతా ఆమెలో వచ్చిన మార్పుకి ఎంతయినా ఆనందించారు. ఆ మార్పు కంతటికీ నేనే కారణం అని తెలిసి ఉంటే వాళ్ళంతా నన్ను ఎంతలా అభినందించేవారో ఏమో! ...

పరిమళతో పరిచయం ఏర్పడి అప్పటికి ఏడాది దగ్గర పడుతూంది. ఆమె నా గురించి ఎన్ని ఆశలు పెట్టుకుందో, మనసులో ఎలాంటి కోరికలు నింపుకుందో నాకు తెలీదు. నేను మాత్రం ఆమెను మనః స్ఫూర్తిగా ఎప్పుడూ ప్రేమించలేదు. ప్రేమించినట్టు నటిస్తూ వచ్చాను. అంతే! ఆమె నన్ను మనసారా నమ్మింది. నేను ఆమెను ఘోరంగా మోసగించాను. నా గురించి నిజం తెలిశాక ఆమె నన్ను ఎంతలా అసహ్యించుకుంటుందో, ఏ విధంగా ఏవగించుకుంటుందో నాకు తెలుసు.

పరిమళను నా దానిగా చేసుకుంటేనో! అంత కన్నా అదృష్టం వేరొకటి ఉండదని ఒప్పుకుంటాను. కానీ, ఆ నిర్ణయం మాత్రం నేను తీసుకోలేను. అందుకు నా దగ్గర రెండు కారణాలు సిద్ధంగా ఉన్నాయి. ఒకటి— పరిమళ అంతస్తుకి, ఐశ్వర్యానికి నేను సరితూగను. రెండు — ఆమెను పెళ్ళాడటానికి అమెరికానుండి తొందర్లోనే వాళ్ళ బావ రాబోతున్నాడు.

పరిమళ నాకు దూరమవుతుందనే ఆలోచన మనసుకి బాధ కలిగిస్తున్నా, ఆ బంధాన్ని అంతటితో తెంచుకోక తప్పదు.

నేను ధరించిన పాత్ర త్వరలోనే సమాప్తి కాబోతూంది.


• • • •

నా నిజ రూపం పరిమళ ముందు పెట్టాను.

నేను చెప్పినదంతా విన్నాక ఆమె ఒక్కసారిగా అదిరిపడింది. ఆమె ఆపాద మస్తకం భయంతో కంపించింది. ఆమె ముఖంలో దైన్యం, మనసులో ఆవేదన చోటు చేసుకున్నాయి. ఆమె కళ్ళలో నీళ్ళు సుళ్ళు తిరుగుతున్నాయి.

"చంద్రం! పరిహాస మాడటానికి ఇది సమయం కాదు. మీరు చెప్పేదంతా అబద్ధమని ఒప్పుకోండి. నన్ను మనఃస్ఫూర్తిగా ప్రేమించానని చెప్పండి. ప్లీజు, ప్రేమించినట్టు నటించాననిమాత్రం అనకండి. నేను భరించలేను" అంది వణికే గొంతుతో.

పరిమళకు ఏమని సమాధానం చెప్పాలో, ఎలా



దీపావళిరోజున సన్మానించి ఇలాంటి "దండ" వేస్తారటయ్యా.

సోదార్చాలో నాకు అర్థం కావడం లేదు. ఇలాంటి పరిస్థితి ఒకటి ఎదుర్కోవలసి వస్తుందని నేను ముందుగా వూహించలేదు.

"నన్ను అర్థం చేసుకోవడానికి ప్రయత్నించు, పరిమళా! నీలో ఉన్న కోపాన్ని, ఆవేశాన్ని దూరం చెయ్యాలని, నిన్ను వూరికే రెచ్చగొడుతున్నవాళ్ళ నోళ్ళు కట్టించాలని, నీ మంచితనాన్ని నలుగురూ గుర్తించాలని ఆశపడ్డాను. అందుకోసం ఈ చిన్న నాటకం ఆడాల్సి వచ్చింది తప్ప, నిజానికి నీ మీద నా కెలాంటి ఉద్దేశమూ లేదు. నీ మనసు ఏ విధంగా నయినా నొప్పించి ఉంటే క్షమించు పరిమళా!" అన్నాను నాలో ఉన్న ధైర్యాన్ని కూడగట్టుకుని.

"నా మూలంగా ఏదయినా పొరపాటు జరిగి ఉంటే చెప్పండి. సరిదిద్దుకుంటాను. మీ మనసుకి నొప్పి కలిగేలా ఇంకెప్పుడూ ప్రవర్తించను. మీరు ఎలాంటి శిక్ష విధించినా ఫర్వాలేదు కానీ, నన్ను మాత్రం దూరం చేస్తే భరించలేను." ప్రాధేయపడింది పరిమళ.

ఆమె చెంపలు రెండూ కన్నీళ్ళతో తడిసిపోతున్నాయి. నా మనసు ఏ క్షణంలో నయినా కరిగిపోయేలా ఉంది. ఆమెను అమాంతం నా గుండెకు హత్తుకుని, "నువ్వు ఎప్పటికీ నా దానవే, పరిమళా! నిన్ను బాధపెట్టినందుకు క్షమించు" అని చెప్పా లనిపించింది. కానీ, నా మనస్సు నా గొంతు నొక్కేసి నా ప్రయత్నానికి కళ్ళెం బిగించింది.

"నా మూలంగా మీ కుటుంబంలో కలతల రావడం నా కిష్టం లేదు. నన్ను నువ్వు, నిన్ను నేను మరిచిపోవడమే మంచిది. నీలో అనవసరంగా ఆశలు రేపి ఉంటే క్షమించు. నీకు అన్ని విధాల తగిన మీ బావ ఉన్నాడు. అతణ్ణే చేసుకుంటే అన్ని విధాల నువ్వు సుఖపడరావు" అన్నాను ఏదో విధంగా ఆమెకు నచ్చచెప్పాలని.

"చంద్రం! జీవితంలో మొదటిసారిగా నేను మిమ్మల్ని ప్రేమించాను. మీరే సర్వస్వమని భావించాను. మానసికంగా మీకు నేను ఏనాడో భార్యనయ్యాను. నా హృదయంలో మీకు తప్ప వేరొకరికి స్థానం లేదు. మీరు సమ్మతించాలే కానీ, నా నిర్ణయాన్ని ఇంట్లో ఎవరూ కాదనరు. ఆ నమ్మకం నా కుంది" అని చెప్పి నా సమాధానం కోసం ఆగింది.

నేను ఎటూ తేల్చుకోలేని సందిగ్ధంలో పడిపోయాను. పరిమళకు ఏ విధంగా నచ్చచబితే బాగుంటుందా అని మవునంగా ఆలోచిస్తున్నాను.

"మీరు సమాధానం చెప్పరు. నాకు తెలుసు. ఆడదానిగా నేను పాటించవలసిన విధులు, నేర్చుకోవలసిన నీతులు అన్నీ చెప్పేశారుగా! ఇంకా ఏం మిగిలాయని చెప్పడానికి? మీరు సంకల్పించిన పని దిగ్విజయంగా నెరవేరిందన్న తృప్తి మీకు మిగిలితే చాలు. అంతకుమించి మీకు ఏమీ అక్కర్లేదు. నేనూ ఒక మనిషినని, నాకూ ఒక మనసు ఉందని ఎప్పుడయినా ఆలోచించారా? అవన్నీ మీ కెందుకు ఆలోచిస్తారండీ? మనసారా ప్రేమించిన వారిని మరిచిపొమ్మని, మరెవరినో కట్టుకోమని అమూల్యమైన సలహాలయితే ఇవ్వగలరు. కానీ మీ రిచ్చిన సలహాను ఆచరణలో పెట్టగల తెగువ, ధైర్యం నాకు లేవండీ! మీరు దూరం చేసిన పరిమళ ఎన్నటికీ మరొకరికి దగ్గర కాలేదు. అందుకే జీవితంలో ఎప్పుడూ, ఎవరికీ కనిపించనంత దూరం వెళ్ళిపోతాను" అని చెప్పి నా కళ్ళముందు నుండి వేగంగా కదిలి వెళ్ళిపోయింది పరిమళ.

ఆ రాత్రంతా నాకు నిద్ర పట్టలేదు. పరిమళ వెళ్ళేముందు పలికిన మాటలు నా చెవుల్లో ఇంకా ప్రతిధ్వనిస్తూనే ఉన్నాయి. ఆ మాటలు ఇప్పుడు నాలో ఎప్పుడూ లేనంత భయాన్ని కలిగిస్తున్నాయి. పరిమళ సంగతి నాకు బాగా తెలుసు. ఆమెకు అభిమానం, పట్టుదల ఎక్కువ. అన్నంత పని చేసి తీరుతుంది. పరిస్థితులు అంతవరకు విషమించకుండా చూసుకోవాలి. ఆమె ఏ అఘాయిత్యమూ తలపెట్టక ముందే వెళ్ళి కాపాడుకోవాలి. తెల్లవారిన వెంటనే పరిమళను కలుసుకుని, నా తొందరపాటుకి క్షమాపణ చెప్పుకోవాలి. ఎన్ని ఇబ్బందులు ఉన్నా ఎదిరించి ఆమెను నా దానిగా చేసుకోవాలి. పరిమళ నాదయితే అంతకన్నా అదృష్టం వేరొకటి ఉండదు. ఆ మాట ఇప్పుడు నేను ధైర్యంగా అనగలను.

అలా ఆలోచిస్తూ పక్క మీద పొర్లుతున్న నాకు ఎప్పుడు నిద్ర పట్టిందో గుర్తు లేదు. ఉదయం పనిమనిషి వచ్చి తలుపు తట్టేవరకు తిరిగి మెలకువ రాలేదు. నిద్రమంచం దిగిన నా కాళ్ళు అప్రయత్నంగా వరండాలోకి లాక్కు వెళ్ళాయి. పరిమళ ఇంటిముందు గుమిగూడిన జనాన్ని చూసేసరికి నా కళ్ళలోని మత్తు పూర్తిగా వదిలిపోయింది. రోడ్డు నుండి వినవస్తున్న ఏడుపులు, పెడబొబ్బలు నాలో భయాన్ని రేకెత్తించాయి. నా గుండెలో మొదలయిన వణుకు విద్యుచ్ఛక్తిలా దేహమంతా ప్రాకింది.

"పరిమళ కేమీ జరగలేదు కదా?" నన్ను నేను ప్రశ్నించుకున్నంత మెల్లగా అడిగాను మా పని మనిషిని.

"బంగారంలాంటి పిల్ల — ఉరేసుకుని సచ్చిపోయిందట, బాబూ! ఆ యమ్మ ఎందు కా పని చేసిందో ఇంట్లో ఎవులికీ తెల్దట. ఆ బగమంతుడికి పడి ఏడుస్తున్నారు, పాపం, అల్లంతా" అని జాలిపడుతూ చెప్పింది.

"ఎంత తొందరపడ్డావు, పరిమళా! నీ మంచి కోరి నీ నిండు ప్రాణాలనే బలి తీసుకున్నాననీ, నిన్ను నీ వాళ్ళందరికి దూరం చేసిన హంతకుణ్ణి నేనేననీ, నీ చావుకి నేను మాత్రమే కారకుణ్ణనీ ఎవరితో చెప్పుకోను? ఏ శిక్ష విధించమని అడగను? చెప్పు, పరిమళా!"... పశ్చాత్తాపంతో నా హృదయం పెడుతున్న ఘోష ఎవరికి వినిపిస్తుంది? వినిపించినా ఎవరికి అర్థమవుతుంది? ✱